## చిన్నకథ

# ఎందుకంట....?

"అదేంటి నీలా! నిన్న గాక మొన్న బొంకుల దిబ్బ దగ్గర కనపడినప్పుడు దాసన్న పేటలో వుంటున్నామని చెప్పింది. మళ్లా ఇప్పుడు ఇల్లు మారిందా?'' నివ్వెరపోవడంలో ప్రథమ స్థానం నాదే.

''అంతవరకూ ఎందుకండీ! మొన్ననేగా కనపాకలో ఓ ఇల్లు కారు చవగ్గా వచ్చిందని దిగింది. ఇంకా నెలైనా కాలేదు. ఇంతలోనే ఇల్లు మార్చిందా?'' ముక్కు మీద వేలు వేసుకోవడం శ్రీమతి సంధ్య వంతయింది.

మా ఇరువురి ప్రస్థావన భీమాయమ్మ గురించే!

ఆవిడ తగువుల మారని వినికిడి. రూపానికి సూర్యాకాంతానికి ప్రతిబింబం. ఆవిడుకున్నదల్లా ఒకే ఒక్క కొడుకు. వాడు తన పెళ్లాన్ని తల్లి దగ్గర విడిచిపెట్టి అరబ్ దేశాలకు పోయాడు. మనవలిద్దరూ పెంకిఘటాలు. కోడలు భర్త దగ్గరకు వెళ్లిపోతానని గొడవ పెడుతున్నా సరే పంపకుండా తన వద్దే అట్టే పెట్టుకుంది భీమాయమ్మ.



ఆవిడ గారి చరిత్ర మాకెలా తెలిసిందంటే మేం కూడా అద్దె ఇంటి బాధితులమే కాబట్టి! ఒకానొక సమయంలో మేమూ, భీమాయమ్మ ఇరుగు పొరుగున వుండేవాళ్లం. తర్వాత ఆవిడ మాత్రం మా పక్క నుంచి ఖాళీ చేసి వెళ్లిపోయింది. మేం మాత్రం ఇప్పటికీ అదే ఇంట్లో వుంటున్నాం. ఆశ్చర్యకరమైన విషయం ఏమంటే భీమాయమ్మ మాత్రం ఈ యేడాదిలో పదిసార్లు ఇల్లు మారిందని తెలిసింది.

''కుదురుగా నుండకుండా ఎందుకలా గానుగెద్దులా తిరుగుతుందో అర్థం కావడం లేదు. ఆవిడ ఓపికకి మెచ్చుకోవాలి. ఒకసారి ఇల్లు మారడానికి తల ప్రాణం తోకకి వస్తుంది. మరి ఆవిడకి వచ్చిన చిక్కు ఏమిటో నాకు అర్థం కావడం లేదు'' విసుగ్గానే అంది సంధ్య.

''ఆవిడ ఎలా పోతే మనకెందుగ్గానీ ఈ రోజు మీ సావిత్రి మేడమ్ పుట్టినరోజు పార్టీకి పిలిచారని చెప్పావు గుర్తు లేదా?'' అని ప్రస్తావన మరలించాను.

అప్పుడు జ్ఞాపకం వచ్చిందంటూ నాలిక్కరుచుకుంది సంధ్య. ఆ వెంటనే గబగబ తయారయింది. సావిత్రి మేడమ్ ఇంటికి వెడుతూ మధ్యలోనే ఆగి బహుమతి కొనుక్కొని వెళ్లాం. అప్పటికే మా కోసం ఎదురు చూస్తోంది.

''సంధ్యా! ఇప్పుడా రావడం? నాకిక్కడ సాయం చేసేవాళ్లే కరువయ్యారు'' బాధగా అంది సంధ్య. అలా అనడంతోనే పనుల్లో పడింది సంధ్య. అన్నీ అమర్చింది. వచ్చిన అతిథులను ఆహ్వానించసాగింది.

బయట ఏర్పాట్లు నేను చూశాను. ఆ సమయంలో పక్కింట్లోంచి విపరీతంగా చప్పుళ్లు...కర్ణకఠోరంగా వున్నాయవి.

అబ్బా! చస్తున్నాం. ఈ ఒక్కరోజయినా ఊరుకోకూడదూ... ఈ పార్టీ అయిపోయాక సర్దుకోవచ్చు కదా! అదే పైకి అనేశాను. ఆ మాట వినిపించిన సావిత్రి నాతో....''అది కాదు అన్నయ్యగారూ! మా పక్కింట్లో ఒకావిడ ఇల్లు మారుతోంది. ఆ సామాను సర్దడంలో ఆవిడ తలమునకలై వుంది. ఇప్పుడు మనం ఏం చెప్పినా వినిపించుకోదు. ఆవిడ పని ఆవిడదే'' అని చెప్పింది.

అయితే నాకు మాత్రం మండు కొచ్చింది. కొంచెం చప్పుడు చేయకుండా కాస్సేపు వుండమని చెప్పాలని పక్కింటికి వెళ్లాను. నా పిలుపుకి ఇటు తిరిగింది.

అంతే! ఒక్కసారిగా దిగ్భ్రాంతికి లోనయ్యాను. ఆమె ఎవరో కాదు. భీమాయమ్మ...! ఈవిడకి పిచ్చా? వెర్రా? నాలుగు రోజుల క్రితం బాబామెట్టలో ఓ ఇంట్లో దిగిన మనిషి ఇంతలోనే ఏ మొచ్చిందని మారిపోతోంది. గబగబ తిరిగి వచ్చాను. నేను చూసిన విషయాన్ని సంధ్యతో చెప్పాను. నోరెళ్లబెట్టింది.

''అసలీవిడగారి ఉద్దేశ్యమేమిటో? పోనీ అద్దె ఇళ్ల వాళ్లతో బాధ పడకపోతే ఓ ఇల్లు కట్టుకొని పడి వుండవచ్చు కదా!'' సంధ్య వెర్రెత్తిపోయింది. ఆ విషయమే సావిత్రితో అంటే తనెంత చెప్పినా ఆవిడ వినడం లేదని చెప్పింది. ఇది జరిగిన మరో ఇరవై రోజులు గడిచాయి. మా మిత్రుడు విస్సు దగ్గరకి వెళ్లాం. వాడితో మాట మంతీ అయినాక ఎవరో వచ్చి ''మా డబ్బులు మాకిప్పేస్తే మేం ఖాళీ చేస్తాం'' అని చెయ్యిచాపాడు.

''నిన్నగాక మొన్న దిగారు. ఏమీ అనలేదు కానీ మారిపోతారట. మంచికి రోజులు కావివి'' అని వెళ్లి డబ్బులు ఇచ్చి పంపేశాడు. మా ఆవిడ బయటకు వెళ్లి చూసింది. గిరుక్కున వెనక్కి వచ్చి ''ఏమండీ! భీమాయమ్మ..సావిత్రి ఇంట్లోంచి ఈ ఇంట్లో దిగినట్టుంది. మళ్లీ అంతలోనే ఎక్కడికో మారుతోంది. పిచ్చి మనిషిలా వుంది'' అని తెగ ఆశ్చర్యపోతూ చెప్పింది.

''ఇల్లు మారడం ఆవిడక వ్యసనంలా వుంది'' దారిలో అన్నాను సంధ్యతో.

చాలా రోజులు గడిచాయి. ఈ మధ్య కాలంలో భీమాయమ్మ కనిపించలేదు. కానీ, ఓ రోజు హటాత్తుగా మాకో దృశ్యం కనపడింది. అదేమిటంటే.... గురజాడవారి వీధిలో లారీలోకి సామాన్లు ఎక్కిస్తు కనిపించింది భీమాయమ్మ. ఆవిడ ఇప్పటికి ఇలా ఎన్ని ఇళ్లు మారిందో లెక్కలేదు. అసలు ఎందుకు మారుతున్నదీ తెలియడలేదు. అది మొదలు కారణం తెలుసుకోవాన్న ఉత్సుకత మొదలైంది..

''మీకెందు? ఆవిడ ఇష్టం. మనకేం నొప్పి లేదు కదా! మీకెందుకా కుతూహలం?'' అని దెబ్బలాడింది సంధ్య. అయినా సరే నేను ఊరుకోలేదు. వెంటనే ఆవిడ ఎక్కడికి మారిందీ తెలుసుకుని మరీ వెళ్లాను. నాతో పాటే సంధ్యను కూడా లాక్కెళ్లాను.

భీమాయమ్మ గారు మమ్మల్ని గుర్తుపట్టి లోనికి తీసుకెళ్లారు. ఆవిడ ఇచ్చిన కాఫీని తాగినాక ఆమె అడిగింది.

''ఏం బాబూ! ఇలా వచ్చారు. ఏం కావాలి?''

''మరేం లేదు. మిమ్మల్ని ఓ ప్రశ్న వేస్తాం. ఏమనుకోకండి. చాలా కాలంగా మీరు ఎన్నో ఇళ్లు మారుతున్నారు. దానికి కారణం మాకు ఎంత మాత్రం అర్థం కావడం లేదు. అసలు మారాల్సిన అవసరం ఏమొచ్చిందని? మీరు కయ్యాలు పెట్టుకునే వారిలా కనపడరు కూడా.'' ధైర్యం చేసి అడిగాను. నా మాటకి పకపకా నవ్వేస్తూ జవాబిచ్చింది భీమాయమ్మ.

''ఈ మధ్య ఎవరెవరో ఏవేవో వెర్రి పనులు చూస్తూ రికార్డుల్లోకి ఎక్కేస్తున్నారు. అది చూశాక నాకు అనిపించింది. ఏదైనా పనిచేసి రికార్డుల్లోకి ఎక్కాలని. అందుకే ఇంత వరకూ ఎవరూ చేయని పని చేయాలనుకున్నాను. చేస్తున్నాను. అద్దె ఇళ్లు ఎక్కువగా మారిన వనితగా పేరు దక్కించుకోవాలని. అదేదో గిన్నీసు బుక్కంట. దాన్లోకి ఎక్కాలనే నా ఈ అవస్థంతా.''

ఆ మాట వింటూనే నేను, సంధ్య ఒకరి మొహాలొకరం చూసుకున్నాం. ఆవిడ చేస్తున్న ప్రయత్నం చూసి హర్షించాలో లేక ప్రస్తుతం పడుతున్న అవస్థ చూసి విచారించాలో మాకు అర్థం కాలేదు.

– కె.కె. రఘునందన